www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబర్ 2023 | 5 | ఏలూరు

ఇసుక సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇసుక సమస్యను పరిష్కరించి కార్మికుల ఉపాధిని కాపాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో పీరా అప్పారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో రమణారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేసి నిర్మాణ కార్మికుల పెండింగ్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ బోర్డు చట్టం అమలు కోసం ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో రెడ్డి లక్ష్మణరావు, వరసా రాజేష్, సురేష్, పి.గోపి, కె.నవీన్ మాట్లాడారు.

జెడ్‌పి సమావేశానికి ఎంఎల్ఎలు డుమ్మా..!

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

- తూతూమంత్రంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- కనీసం పట్టని మంత్రులు, 15 మంది ఎంఎల్ఎలకు ఇద్దరే హాజరు
- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ రాకపోవడంపై సభ్యుల అసంతృప్తి
- ఇళ్ల నిర్మాణం, కరువు, సాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల ఏకరువు
- ఎంపిపిలను మాట్లాడనీయడం లేదంటూ పోలవరం ఎంపిపి ఆగ్రహం
- సమాచార పుస్తకాలివ్వడం సైతం నిలిపివేసిన జెడ్‌పి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని సమస్యలకు పరిష్కార వేదికగా కొనసాగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రం అన్నట్లు మారిపోయింది. మంత్రులు, ఎంఎల్ఎలు జెడ్‌పి సమావేశాన్ని పూర్తిగా పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. దీంతో ప్రజా సమస్య పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన సమావేశం నామమాత్రపు అన్నట్లు తయారైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశం తీరు చూసిన వారందరిలో జెడ్‌పి సమావేశం ఇలా తయారైందేమిటనే చర్చ సాగింది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక స్థానం ఉండేది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సమావేశం సాగేది. మంత్రులు, ఎంఎల్ఎలు అంతా హాజరై ప్రజాసమస్యలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులను సమావేశంలో నిలదీసేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 మంది ఎంఎల్ఎలు ఉండగా జిల్లా పరిషత్ సమావేశానికి దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయిచౌదరి, ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మినహా ఏ ఎమ్మెల్యే, ఎంఎల్‌సి హాజరు కాలేదు. ఎంపి కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండగా జిల్లా విభజన జరిగిన ఒక్క మంత్రి కూడా జిల్లా పరిషత్ సమావేశానికి హాజరు కావడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, పశ్చిమ కలెక్టర్ పి.ప్రశాంతి సమావేశానికి హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. జిల్లాలోని తొమ్మిది మండలాలు విభజనలో తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి. అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు సమాధానం చెప్పేందుకు ఆ జిల్లా నుంచి కలెక్టర్‌గాని, జాయింట్ కలెక్టర్‌గాని ఏఒక్కరూ రాలేదు. దీంతో అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదే కృష్ణా జిల్లా జెడ్‌పి సమావేశానికి ఇక్కడి అధికారులు వెళ్లకపోతే అక్కడి ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం తెలపడమే కాకుండా, ముఖ్యమంత్రి కార్యాలయం వరకూ సమస్యను తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. మంత్రులు, ఎంఎల్ఎలు సమావేశాలకు రాకపోవడంతో అధికారులను నిలదీసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సమస్యలపై సభ్యులకు సంతృప్తికరమైన సమాధానాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొన్ని విధానపరమైన నిర్ణయాల విషయంలో మంత్రులు ఉంటే తర్వాత సిఎంతో మాట్లాడే అవకాశం ఉంటుంది. మంత్రులు రాకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా పరిషత్ సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు ప్రత్యేకత ఉంటుంది. మినిట్స్‌లో నోట్ అవుతాయి. తర్వాత సమావేశంలోపు పరిష్కరించకపోతే అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్ఎలు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రోజంతా జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభించి మమ అన్పించేస్తున్నారు. జెడ్‌పిటిసి, ఎంపిపిలు లేవనెత్తిన ఒకటి, రెండు సమస్యలపై ముక్తసరిగా సమాధానాలు ఇచ్చి ముగించేస్తున్నారు. పలు సమస్యలు తర్వాత సమావేశంలోనూ కొనసాగుతున్న పరిస్థితి ఉంది. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపిపిలను మాట్లాడనీయడం లేదు

పోలవరం ఎంపిపి ఎస్.వెంకటరెడ్డి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపిపిలకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం లేదంటూ పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభ ప్రారంభంలోనే పోలవరం ఎంపిపి లేచి సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం వచ్చినప్పుడు మాట్లాడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. చాలాసేపు వేచిచూసిన తర్వాత జెడ్‌పిటిసీలకు అవకాశం ఇచ్చి ఎంపిపిలకు అవకాశం రావడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు సభలో గందరగోళం నెలకొంది. ఎంఎల్ఎలు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

పలు సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల గళం

తమ మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు-నేడుకు సంబంధించి స్కూళ్లలో పనులు జరుగకపోవడం, నిర్దేశించిన పిహెచ్‌సిలో బెడ్స్ పెంచకపోవడం, సిబ్బంది నియామకం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సమస్యలను సభ్యులు లేవనెత్తారు. పదేకరాల్లోపు అర్హులైన ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తించకపోవడం, డ్వాక్రాకు సంబంధించి భవనాలు పూర్తి చేయకుండా వదిలేయడం, ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటల పరిస్థితిపైనా, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి, ఆరోగ్యశ్రీలో ఎదురవుతున్న ఇబ్బందులు, భూసర్వేలో జరుగుతున్న అవకతవకలను, దెందులూరు వంటి మండలాల్లో సాగునీటి సమస్య వంటి అనేక సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తడంతో అధికారులు సమాధానాలిచ్చారు.

దెబ్బతిన్న పంటల పరిస్థితి ఏమిటి

కోటగిరి శ్రీధర్, ఎంపి

'గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికోసం మంత్రి పదవిని సైతం వదిలేసేవారు. జిల్లా పరిషత్ ఎంత బాగా పని చేస్తే పరిపాలన అంతా బాగా జరుగుతుంది. చింతలపూడి వంటి మండలాల్లో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిస్థితి ఏమిటి' అని ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు సంబంధించి రెండు రకాలుగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రై డెడ్ కండిషన్‌లో 15 గ్రామాల్లో 1800 ఎకరాలు దెబ్బతిందన్నారు. వెదరింగ్ కండిషన్‌లో 8 గ్రామాల్లో 2,900 ఎకరాలకు ఇబ్బంది వచ్చిందని తెలిపారు. దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. జిల్లాలో ఏడు మండలాల్లోని 51 గ్రామాల్లో నాలుగు వేల ఎకరాల్లో 75 శాతం పంట దెబ్బతిందని, 11 మండలాల్లోని 91 గ్రామాల్లో 8,065 ఎకరాల్లో పంట వడిలిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు.

కులగణనతో అందరికీ సంక్షేమ ఫలాలు : కలెక్టర్

27 నుంచి వారం రోజుల పాటు సర్వే

యాప్‌లో కోరిన వివరాలతో సమగ్రత ఉండదు : ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిరుపేద కులాల వారికి అందించడమే కుల గణన ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో కుల గణన నిర్వహణపై వివిధ సామాజిక తరగతుల ప్రజలకు అవగాహన, సూచనలు స్వీకరణకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ సామాజిక న్యాయం అందించాలన్నదే కులగణన ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో కులగణన సర్వే ఈనెల 27వ తేదీ నుండి వారం రోజుల పాటు జరుగుతుందని, సంచార జాతులు, వలస కార్మికులు, సర్వే సమయంలో అందుబాటులో లేనివారి వివరాలు సర్వే కోసం మరో వారం రోజులు సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సర్వేలో ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు నమోదు చేస్తారన్నారు. కుల గణన సర్వే గ్రామ/వార్డ్ సచివాలయాలు పరిధిలో జరుగుతుందని, కుటుంబ సభ్యుల విద్య, ఆర్థిక, సామజిక, కులం, ఉపకులం వివరాలు కులగణన ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారన్నారు. సర్వేలో సచివాలయ కార్యదర్శి, వాలంటీర్లు పాల్గొంటారన్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన కులాన్ని పరిగణనలోకి తీసుకుంటారని, కుల నిర్ధారణ కోసం ఎలాంటి ధృవీకరణ పత్రం అందించాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబంలోని సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేసిన తరువాత 18 సంవత్సరాలు నిండిన సభ్యుల ఇకెవైసితో నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వేలో సేకరించిన వివరాలతో ఏ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమానికి అనుసంధానించడం జరగదని, పథకాలు తొలగించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజలు అపోహలు పడొద్దన్నారు. జిల్లాలో 696 కులాలు, ఉపకులాలున్నాయని, వాటిని యాప్‌లో పొందుపరిచామని, వాటిలో లేని కులాలు గానీ, ఉపకులాల గానీ తమ దృష్టికి తీసుకువస్తే వాటిని కూడా యాప్‌లో పొందుపరుస్తామన్నారు. సర్వే విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ దేశంలో కుల గణన 1931లో చేపట్టారని, మళ్ళీ ఎన్నో దశాబ్దాల తరువాత సిఎం జగన్ చొరవతో కులగణన చేపట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు.

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కుల గణనను స్వాగతిస్తున్నామన్నారు. యాప్‌లో కోరిన వివరాలతో సమగ్ర సమాచారం రాదని, వీటిలో మరికొన్ని అంశాలను చేర్చాల్సి ఉందన్నారు. సివిల్ కండక్ట్ రూల్స్ పరిధిలో లేని గ్రామ/వార్డ్ వాలంటీర్లకు సర్వే నిర్వహణను అప్పగించొద్దన్నారు. సర్వే చేపట్టడంతో పాటు కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, బీహార్‌లో చేసిన కులగణనకు చట్టబద్ధత కల్పించి, రిజర్వేషన్లు సవరించారని, అదే విధంగా రాష్ట్రంలో అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, కులగణన ప్రాతిపదికన పేదలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కులగణన సర్వేకు వారం రోజుల సమయం సరిపోదని, మరింత పెంచాలని కోరారు. ఈ సమావేశంలో మెండెం సంతోష్‌కుమార్, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎ.శివకేశవరావు, పొలిమేర హరికృష్ణ, చప్పిటి గంగాధరరావు తమ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జెసి బి.లావణ్య వేణి, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా పరిషత్ సిఇఒ సుబ్బారావు, అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూస్వాముల ఆక్రమిత భూమిని పేదలకు పంచాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదల సీలింగ్ భూములను భూస్వాములకు కట్టబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ లక్ష్యంగా ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం విమర్శించారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మండల కమిటీ సమావేశం యాగంటి సీత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీవరత్నం మాట్లాడుతూ సిఎం జగన్ పేదలకు భూ పంపిణీ చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారని, కానీ జిల్లాలో భూస్వాముల వద్ద ఉన్న ప్రభుత్వ భూములు పేద ప్రజలకు ఎంతమందికి ఎన్ని పట్టాలిచ్చారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మండలంలో వేలాది ఎకరాల సీలింగ్ ప్రభుత్వ భూములున్నాయని తెలిపారు. పంగిడిగూడెంలో సర్వేనెంబర్ 215/1,2,3,4, 222/152లో 300 ఎకరాల సీలింగ్ భూములు భూస్వాముల స్వాధీనంలో ఉన్నాయని, వాటిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. దీనికోసం 20 సంవత్సరాల నుంచి పేదలు పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు భూస్వాములతో కుమ్మక్కై, పేదలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టి కోర్టులు చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు భూముల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ భూస్వాములు ఇచ్చే తాయిలాలకు అధికారులు కక్కుర్తి పడి ఆ భూములను భూస్వాములకే కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఈ భూములు పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురవాయిగూడెంలో సర్వే నెంబర్69/1, 69/2లో 80 ఎకరాల సీలింగ్ భూములు అధికార పార్టీ నాయకుని చేతుల్లో ఉన్నాయని తెలిపారు. ఆ భూములను కాపాడేందుకు స్వయంగా ఏలూరు ఎంపీ అండదండలు ఆయనకు ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. లక్కవరం, దేవులపల్లి, వేగవరం పట్టెన్నపాలెం, తిరుమలాపురం, కేతవరం, నాగులగూడెం గ్రామాల్లో ప్రభుత్వ భూములు వేలాది ఎకరాలు భూస్వాముల ఆదీనంలో ఉన్నాయని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం ఈ భూములను పేదలకు పంచాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, కె.సుబ్బారావు, వి.నరసారావు, సిహెచ్.లక్ష్మీనారాయణ, బి.వెంకన్న, ఎన్.నాగరాజు, పి.చంటి పాల్గొన్నారు.

గుంటుపల్లిలో 'గుంతల ఆంధ్రాకు దారేది'

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని, ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో ప్రధాన రహదారులే కాక అంతర్గత రోడ్లన్నీ నడవడానికి కూడా లేకుండా అధ్వానంగా ఉన్నాయని, తక్షణం మరమ్మతులు చేపట్టాలని చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీరామకృష్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కామవరపుకోట మండలంలోని గుంటుపల్లిలో చిధ్రమైన రోడ్లను అభివృద్ధి చేయాలంటూ నియోజకవర్గ టిడిపి, జనసేన నాయకులు శనివారం 'గుంతల ఆంధ్రాకు దారేది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా, భారీగోతులతో ప్రమాదకరంగా మారాయన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లను పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. గతంలో టిడిపి ఆధ్వర్యాన గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడితే అడ్డుకున్నారని, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జనసేన, టిడిపి నాయకులు కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టి, గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, టిడిపి నాయకులు యాళ్ల లీలాప్రశాంతి పాల్గొన్నారు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకుంటాం : ఎలిజా

చింతలపూడి :నీరు లేక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. చింతలపూడి పట్టణంలో డిసిఎంఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. దళారుల ప్రలోభాలకు రైతులు గురికావొద్దన్నారు. రైతులకు సరిపడ గోనె సంచులను ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుందని, రవాణా ఖర్చులు కూడా భరిస్తుందని తెలిపారు. రైతుల సమస్యలపై మిల్లర్లతో మాట్లాడి రైతులకు నష్టం లేకుండా చూస్తామన్నారు. తేమశాతంలో తప్పులు చేయొద్దని సిబ్బందికి సూచించారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తరువాత మాత్రమే విక్రయించాలని రైతులను కోరారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు నాగకుమార్, తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎఒ మీనాకుమారి, చింతంపల్లి సర్పంచి రామకృష్ణ, యడ్ల మోహన్, మిర్యాల దిలీప్, అలవాల బాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లోనే ధాన్యం విక్రయించాలి : డిఎన్ఆర్

ముదినేపల్లి:రైతులు తమ ధాన్యాన్ని ఆర్‌బికెల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్) కోరారు. వాడవల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. గోనె సంచులు, రవాణా సదుపాయాలను ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతాప్రమాణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వాడవల్లి సర్పంచి సుధాబత్తుల లక్ష్మీ పద్మావతి, ఎంపిటిసి డి.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

22 నుంచి 'అభినయ' జాతీయ నృత్యోత్సవాలు

ఏలూరు అర్బన్:ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి 28వ జాతీయస్థాయి నృత్యోత్సవాలు, నృత్య పోటీలు వచ్చేనెల 22, 23, 24 తేదీల్లో ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో నిర్వహిస్తున్నామని సంస్థ గౌరవ అధ్యక్షులు అంబికా కృష్ణ, అధ్యక్షులు మనోహర్ గోపాల్ లునాని, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం వారొక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకానాల గురుమూర్తి, వెంకట నారాయణమ్మ మెమోరియల్ కూచిపూడి సోలో, వివిధ శాస్త్రీయ, జానపద నృత్య రీతులకు బృంద నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22 సోలో సబ్ జూనియర్స్, 23 సోలో జూనియర్స్, 24 సోలో సీనియర్స్, మూడు రోజుల బృంద నృత్యపోటీలు రెండు వేదికలపై నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన కూచిపూడి నర్తకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ సుమారు వంద మందికిపైగా నమోదు చేసుకున్నారని, దరఖాస్తులు ఈ నెలాఖరు వరకూ స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు పూర్తి వివరాలకు సంస్థ కార్యదర్శి నాట్యాచార్య దువ్వి హేమసుందర్ (సెల్ : 94406 04935)ను సంప్రదించాలని సూచించారు.

10న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ఏలూరు అర్బన్:వచ్చేనెల పదో తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే అవుసోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఎపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా ఛైర్మన్ కె.రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రథమ మహాసభకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు హాజరవుతున్నారని, పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సీనియారిటీ ప్రకారం వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, ప్రభుత్వశాఖలో పనిచేస్తూ ఆప్కాస్ పరిధిలోకి రాని వారిని ఆప్కాస్ పరిధిలోకి తీసుకోవాలని ఈ మహాసభలో డిమాండ్ చేస్తారని తెలిపారు. జిల్లా అవుట్ సోర్సింగ్ జెఎసి ఛైర్మన్ పి.కిషోర్ కుమార్, కో ఛైర్మన్ టి.రవీంద్రకుమార్, వైస్ ఛైర్మన్ వి.రమేష్, హైమావతి, ఎ.పద్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో విఆర్ఒలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ

భీమడోలు:ధాన్యం కొనుగోలులో కస్టోడియన్ అధికారులుగా ఉన్న విఆర్ఒలు పారదర్శకంగా, అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు ఆర్‌డిఒ షేక్ ఖాజావలీ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 అంశాలపై చర్చించారు. ప్రధానంగా ధాన్యం కొనుగోళ్లు, ప్రాధాన్యత భవన నిర్మాణాల ప్రగతి, స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు వ్యవహరించాల్సిన తీరు, జగనన్న ఇళ్లు వంటివాటిపై సమీక్షించారు. ఈ సమావేశానికి హాజరుకాని ఆర్‌అండ్‌బి భీమడోలు సహాయ ఇంజనీర్, నీటి పారుదల శాఖ , గుండుగొలను సహాయ ఇంజనీర్లకు నోటీసులు ఇవ్వాలని ఎంపిడిఒ పద్మావతిదేవిని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో గుర్తించిన రోగులకు వైద్య సేవలు ఏ మేర అందుతున్నాయన్న విషయమై సమాచారం లేకుండా కిందిస్థాయి అధికారులు రావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మండలానికి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి స్థలం సేకరణలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణ బాధ్యులు వచ్చేనెల పదో తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ మండల పరిధిలోని నాలుగు ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదని, ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భీమడోలు ఆర్‌బికె-2లో తేమ శాతాన్ని లెక్కించే యంత్రం పాడైన కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు 2.5 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివిల్ సప్లయిస్ డిటి ఎ.మాధవరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు మండల పరిధిలోని రోజువారి 50 వేల టన్నుల ధాన్యం మరాడించగల నాలుగు మిల్లులు, రోజుకు 15 వేల టన్నుల ధాన్యాన్ని మరాడించగల రెండు చిన్న మిల్లులు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలుకు జిపిఎస్ అమర్చిన 20 లారీలు, 99 ట్రాక్టర్లు రవాణా కోసం ఉంచామన్నారు. ప్రస్తుతం 74 ట్రాక్టర్ల సేవలు మాత్రమే వినియోగంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఇందిరా గాంధీ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా క్రీడాకారుల హవా

ఏలూరు అర్బన్:ఈ నెల16, 17, 18 తేదీల్లో కర్నూలులో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారు. ఈ జట్టులో స్థానిక సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల నుంచి జట్టులో ఎనిమిది మంది క్రీడాకారులు జట్టుకు ప్రాతినిధ్యం వహించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఐ.ఆండాళ్లు తెలిపారు. అంతేకాక పి.మౌనిక, ఆర్.సౌమ్యశ్రీ, ఎవి.శ్రావణ కుమారి హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

మళ్లీ పాతపాటే..!

'మళ్లీ అవే మాటలు.. అవే ప్రకటనలు.. ఇక కార్యాచరణపైనే అందరి దృష్టి'.. ఇదీ దాళ్వాకు సాగునీరు అందజేత, నూజివీడులో సిఎం పర్యటన, ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం అంశాల విషయంలో ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారుల తీరు.

దాళ్వాకు సాగునీరు అందజేతపై ఇటు ఏలూరు, అటు పశ్చిమగోదావరి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యాన జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. రెండు సమావేశాల్లోనూ గోదావరిలో నీటి లభ్యత, సీలేరు జలాలు తదితర అంశాలతోపాటు కాల్వలకు నీరు నిలిపివేత ఎప్పటి నుంచి అనేది చర్చించి తీర్మానాలు చేశారు. అక్కడా.. ఇక్కడా కూడా ఇరిగేషన్ అధికారులు లెక్కలు చెప్పగా వాటినే వివిధ రూపాల్లో సర్ది దాళ్వా సాగుకు సమృద్ధిగా సాగునీరందిస్తామని ఆయా మంత్రులు ప్రకటించేశారు. ఆపై నారుమడుల ప్రక్రియ ఈ నెలాఖరుకల్లా ముగించేయాలని సైతం స్పష్టం చేశారు. లేనిపక్షంలో సాగునీటి ఇబ్బందులు తప్పవని చల్లగా చావుకబురు చెప్పకనే చెప్పారు. దానికి సంబంధించి నారుమళ్ల ప్రక్రియ వేగవంతం చేసే బాధ్యత వ్యవసాయ శాఖపై మోపారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఏలూరు జిల్లాలో చింతలపూడి, చాట్రాయి తదితర మెట్ట మండలాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కరెంటు సక్రమంగా సరఫరా కాక బోర్ల కింద పంటలు సైతం ఎండిపోయే దుస్థితి నెలకొంది. ఈ సమస్యపై కనీసం చర్చకు అవకాశం ఇవ్వకపోగా ప్రస్తావించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని నిలువరించి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకోవాలని చెప్పడం హాస్యాస్పదమనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. సమస్యపై చర్చించి ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సిన సమావేశంలో సమస్యను పక్కదారి పట్టించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక దాళ్వా సాగుకు సంబంధించి నారుమళ్లు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో నీరు సక్రమంగా అందక, ప్రకృతి కన్నెర్రతో దిగుబడులు తగ్గి రైతులు తల్లడిల్లుతున్నారు. పైకి కన్పించకపోయినా గత దాళ్వాలో ధాన్యం అమ్ముకునే సమయంలో ఎదురైన ఇబ్బందులన్నీ ప్రస్తుతమూ రైతులను వెంటాడుతున్నాయి. అయితే ఇంకా మాసూళ్లు పూర్తికాకపోవడంతో సమస్య తీవ్రత పెద్దగా తెలియడం లేదు. అయితే ఆర్‌బికెల్లో నిర్ధారించిన తేమ శాతమే ఫైనల్ అని, మిల్లర్లు ఎందుకు మళ్లీ తేమ శాతంపై మెలిక పెడుతున్నారనేది పరిశీలిస్తామని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ ఉంగుటూరులో రైతులకు చెప్పారంటే సమస్య అపరిష్కృతంగానే ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగానే రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని మన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. మరి ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకుండా, రైతుల చేతికి సొమ్ము రాకుండా దాళ్వాసాగు ఎలా ప్రారంభిస్తారో అధికారులు, ప్రజాప్రతినిధులే చెప్పాలి. సాగులో ఆలస్యానికి ప్రధాన కారణాల్లో ఒకటి ప్రకృతి విపత్తులైతే ప్రధానమైనది మాత్రం పెట్టుబడి సమస్య. సాగులో 80 శాతంగా ఉన్న కౌలురైతులకు కనీసం రుణార్హత గుర్తింపు కార్డులు ఇవ్వడంలోనే బాగా వెనుకబాటు ఉంది. ఆ కార్డులు అందుకున్న వారికి రుణాలివ్వడంలోనూ బ్యాంకర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదని కలెక్టర్లు నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో తేట తెల్లమవుతోంది. ఈ పరిస్థితుల్లో ధాన్యం అమ్మకాలు పూర్తికాకుండా రైతులు దాళ్వా సాగు ఎలా చేపడతారో అధికారులు, ప్రజాప్రతినిధులకే తెలియాలి. కనీసం ఇప్పటికైనా దాళ్వా సాగుకు అవసరమైన పెట్టుబడిని రుణాల రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగితే నిర్ణీత సమయంలో నారుమళ్ల పనులు రైతులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదేమీ లేకుండా సమృద్ధిగా సాగునీరంటూ మరోసారి రైతులను నష్టాల ఊబిలోకి దించొద్దని పరిశీలకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

నూజివీడులో సిఎం పర్యటన ఊరించి ఉసూరుమన్పించింది. అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేసేందుకు నూజివీడులో శుక్రవారం పెద్దఎత్తున సభ నిర్వహించారు. చింతలపూడి ఎత్తిపోతలను త్వరలోనే పూర్తి చేస్తాం, నూజివీడులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, నూజివీడు పట్టణంలోని 32 వార్డులకు రూ.కోటి చొప్పున అభివృద్ధి నిధుల మంజూరు తప్ప సిఎం జగన్ ఇతర అంశాల జోలికెళ్లలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి ఈ ప్రభుత్వం వచ్చాక చేసిందేమీ లేదు. కనీసం చింతలపూడి పరిసర ప్రాంతాల్లో భూసేకరణ నేపథ్యంలో నష్టపోతున్న రైతులకు సంబంధించి పరిహారం సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది. ఈ సమస్యలన్నీ అలానే ఉంచి యుద్ధప్రాతిపదికన ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తామంటే ఎవరూ నమ్మే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇక నూజివీడు మామిడి జాతీయస్థాయిలోనే ప్రసిద్ధి చెందింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సమస్యలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో మామిడి సాగు క్రమేపీ కుచించుకుపోతుంది. ఈ నేపథ్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామనడం తప్ప మామిడి సాగు ప్రోత్సాహకానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించకపోవడం మామిడి రైతులను నిరాశపర్చింది. నూజివీడు పట్టణంలో 16 సచివాలయాలకు రూ.కోటి చొప్పున నిధులిస్తున్నట్లు సిఎం ప్రకటించారు. అంటే ఒక్కో వార్డుకు రూ.50 లక్షల వరకూ నిధులిచ్చినట్లే. ఇదే ఆచరణకు నోచుకుంటే ఆయా వార్డుల్లో చిన్నపాటి సమస్యలు కొన్ని పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇవి మినహా సిఎం ప్రసంగంలోని మిగిలిన అంశాలన్నీ కొత్త సీసాలో పాత నీరువంటివేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో పేరుకుపోయిన రోడ్ల అధ్వానం, మెట్ట ప్రాంతంలో కరువు ఛాయలు, కొల్లేరు, పరిసర ప్రాంతాల ప్రజల్లో నెలకొన్న ఎకోసెన్సిటివ్ జోన్ భయాందోళనలపై సిఎం జగన్ కనీసం నోరు మెదపకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూడా సిఎం నుంచి ఎటువంటి నిర్దిష్ట హామీలూ రాకపోవడం నూజివీడు ప్రాంత ప్రజలతోపాటు ఏలూరు జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. ఇప్పటికైనా మళ్లీమళ్లీ పాతపాట మాని రెండు జిల్లాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని జిల్లావాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఎన్నికల్లో ఈ ప్రభుత్వం విషయంలో జనాలు పునరాలోచించే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



దాగ్యురే విగ్రహానికి పూలమాల వేసి సత్కరిస్తున్న ఫోటోగ్రాఫర్లు

'కెమెరా సృష్టికర్త దాగ్యురే ధన్యజీవి'

భీమడోలు : గతంలో జరిగిన వివిధ విశేషాలను, అంశాలను వర్తమాన కాలానికి తెలియజేసేందుకు, పరిచయం చేసేందుకు ఫోటోగ్రఫీ సహకరిస్తుందని, దీని సృష్టికర్త దాగ్యురే ధన్యజీవి అని భీమడోలు ఏరియా ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో భీమడోలులోని సంతపేటలో ఏర్పాటు చేసిన శాస్త్రవేత్త అబ్దుల్ కలాం, డాగ్యురే వేదిక వద్ద శనివారం డాగ్యురే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డి.శ్రీరామ్, కార్యవర్గ సభ్యులు ఎవి.రంగారావు, పి.రమణ ఆధ్వర్యంలో సంఘ పరిధిలోని మూడు మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు డాగ్యురే విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు.

ఉపాన్యాస పోటీల్లో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నెహేమియా

యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి

ఏలూరు టౌన్: యువత అందరికి ఆదర్శంగా నిలవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా సమాజంలో గొప్పగా కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవాలని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.నెహేమియా తెలిపారు. శనివారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఏలూరు శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బాలలకు 'మాదక ద్రవ్యాల నిర్మూలనలో బాలలు, యువత పాత్ర' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నెహేమియా మాట్లాడుతూ స్వశక్తితో మంచి ఆలోచనలతో అడుగులు వేస్తూ విజయాలు సొంతం చేసుకొని అటు కుటుంబాన్ని, సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వారు అభినందించారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహ సుపరిటెండెంట్ బివివి.మురళీధర్, సిబ్బంది రంగారావు, సత్యన్నారాయణ, శ్రీనివాసులు, బాలలు పాల్గొన్నారు.

పోలవరంలో క్రీడా కిట్లు అందిస్తున్న మేనేజర్ పవన్‌కుమార్

విద్యార్థులకు క్రీడా కిట్లు అందజేత

గూటాల బ్రాంచి మేనేజర్ పి.పవన్ కుమార్

పోలవరం: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోను రాణించాలని గూటాల కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పి.పవన్ కుమార్ సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా గూటాల కెనరా బ్యాంకు శాఖ వారిచే పాఠశాల విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ చదువు జ్ఞానాన్ని ఇస్తే క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు క్రికెట్ కిట్లను, విద్యార్థినులకు షటిల్ బ్యాట్స్, కాక్స్, టెన్ని కోయిట్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్‌ను అందజేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం కెవి.రాఘవన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు బ్యాంకు శాఖ ద్వారా చేపట్టడం అభినందనీయమని అన్నారు. క్రీడా కిట్లు అందజేసిన బ్రాంచ్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ జగదీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, బొరుసు బాలాజీ పాల్గొన్నారు.

ముదినేపల్లి : తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గారపాటి చౌదరి సూచనల మేరకు ప్రముఖ సినీ పాటల రచయిత అనంత శ్రీరామ్ మండలంలోని దాకరం, ఊటుకూరు, కొత్తపల్లి గ్రామాల యువకులకు శనివారం వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. అనంతరం ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చెవురుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న నాగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు టౌన్: పిఎం విశ్వకర్మ యోజన రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎపిఎస్ఎంఎఫ్‌సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్.కృపావరం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాంప్రదాయక చేతివృత్తి శ్రామికులకు, హస్తకళ నిపుణులకు, స్కిల్ అప్ గ్రేడేషన్, టూల్ కిట్ ప్రోత్సాహకం అందగా నిలవడం కోసం 5 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు నాలుగు సంవత్సరాల్లో ఎంఎంఎస్ఎంఇ లోన్ కింద బ్యాంకుల ద్వారా అనుషంగిక ఫ్రీ క్రెడిట్‌ని సులభంగా లభిస్తుందన్నారు. దీనిని ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాన్ని మైనారిటీ చేతివృత్తుల వారు వినియోగించుకోవల్సిందిగా కోరారు. రిజిస్ట్రేషన్ చేయు సమయానికి కనీస వయస్సు 16 సంవస్సరాలు నిండి వుండాలన్నారు. 18 సాంప్రదాయక చేతివృత్తుల్లో ఒకటైనా చేసుకునే వృత్తిలో వుండాలన్నారు. గత 5 సంవత్సరాలలో పిఎంఇజిపిపిఎం స్వానిధి పిఎం ముద్ర వానిలో లోన్ తీసుకుని ఉండరాదని, తీసుకొంటే ఆ లోన్ చెల్లించిన వారు అర్హులని తెలిపారు. కుటుంబంలో ఈ పథకం ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనర్హులన్నారు.

దరఖాస్తుకు కావల్సిన వివరాలు: ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, అడ్రస్ ప్రూఫ్స్, రేషన్ కార్డు, ప్రభుత్వం ఆమోదం పొందిన ఇతర డాక్యుమెంట్లు, ఆధార్ లింకైన మొబైల్, పాన్‌కార్డు(తప్పనిసరి కాదు)

దరఖాస్తు చేయు విధానం: Pmviswakarma.gov.in ఆన్‌లైన్‌లో మైనార్టీ అభ్యర్థులు, వివిధ వృత్తులు చేసుకుంటున్నవారు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. తదుపరి వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్స్, వెబ్ సైట్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని దేవపూడి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన జోగి పెద్దిరాజులు(36) వ్యవసాయ కూలీ రాత్రి 7గంటల సమయంలో పనిపై ఇంటి నుంచి బైక్‌పై ప్రొద్దువాక వైపు వెళుతుండగా కుక్క అడ్డురావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్సకై 108 వాహనంలో కైకలూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి పెద్దిరాజులు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దిరాజులు ఆకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ శనివారం పెద్దిరాజులు పార్థీవదేహన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. అంజలి ఘటించిన వారిలో గ్రామ సొసైటి అధ్యక్షులు కట్టా మహేష్, మండల పార్టీ అధ్యక్షులు ఎం.ఏసుబాబు, బోయిన అప్పన్న ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డుపై నిల్వ ఉంచిన కంకర

గురజ రోడ్డులో అడ్డగోలుగా నిల్వ చేసిన కంకర, ఇసుక

రహదారులపై ఇళ్ల సామగ్రి నిల్వలు

సంవత్సరాల తరబడి రోడ్లపై అడ్డంకులు

ప్రమాదాల బారిన వాహనదారులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పలు ప్రధాన రహదారుల్లో అపార్టుమెంట్స్, ఇళ్ల నిర్మాణాలు చేసే వ్యక్తులు రోడ్లపై ఇళ్ల నిర్మాణాల్లో ఉపయోగించే సామగ్రిని నిల్వ చేస్తున్నారు. సంవత్సరాల తరబడి రోడ్డు మార్జిన్లల్లో కంకర, ఇసుక, ఐరన్ తదితర వస్తు సామగ్రిని నిల్వ ఉంచుతున్నారు. నిర్మాణాలు చేసే వ్యక్తులు ఈ రోడ్లను సామగ్రి నిల్వ చేసే ప్రదేశాలుగా మార్చుకుంటున్నారు. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లను రెండు మీటర్ల మేర ఆక్రమించడంతో వాహనదారులు అనేక ప్రమాదాలకు గురౌతున్నారు. సంవత్సరాల పాటు అడ్డంకులు రోడ్లపై నిల్వ ఉండడంతో ప్రజలకు ఏంచేయాలో, ఎవరికి చెప్పాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్లపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. సంబంధిత అధికారులు కూడా నిత్యం ఇదే రోడ్లపై వెళుతుంటారు. అయినా వారికి ఈ ఆక్రమణలు కనబడకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అడ్డగోలుగా ఆర్అండ్‌బి రోడ్లను ఆక్రమించి రోడ్లపై సగంకు పైగా ఇంటి సామగ్రిని నిల్వ చేయడంతో ప్రజలు, వాహనచోదకులు పలు ప్రమాదాలకు గురౌతున్నారు. అసలే రోడ్లన్నీ భారీ గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి రోడ్డు కనబడక వాహనదారులు గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. నిత్యం మండలంలో గుంతల్లో పడి అనేక మంది గాయాలపాలవుతున్నారు. రోడ్లతోనే నరకం అనుభవిస్తుంటే ఇది చాలదా అన్నట్లు దీనికి తోడు ముదినేపల్లిలోని రహదారుల వెంబడి ఇళ్ల, దుకాణాల, అపార్టుమెంట్లు నిర్మాణాలు చేసే వ్యక్తులు ఇష్టారాజ్యంగా సంవత్సరాల తరబడి సామగ్రి నిల్వ ఉంచడంతో వాహనాలు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులెదుర్కొంటున్నారు.

ముదినేపల్లిలోని గురజ రోడ్డులో భారత్ గ్యాస్ కార్యాలయం, వడాలి రోడ్డులోని రాము గారి షెడ్డు వద్ద రోడ్డుపై కంకర, ఇసుక, ఐరన్ నిల్వ చేశారు. ఈ నిర్మాణాలు సంవత్సరాల తరబడి జరుగుతుండడంతో సామగ్రి కూడా రోడ్లపైనే సంవత్సరాల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో రాత్రి సమయాల్లోనే కాకుండా, పగటి వేళల్లో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా రెండు వాహనాలు తప్పుకునే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నిర్మాణాలు చేసే వ్యక్తులు బడాబాబులు కావడంతో పంచాయతీ అధికారులు వారికి నోటీసులు ఇచ్చేందుకు భయపడుతున్నట్లు సమాచారం. ఈ రోడ్లలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కువగా ఉండడంతో వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు వివిధ వాహనాల్లో, బస్సుల్లో ఈ రోడ్లపై నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరగకక ముందే అధికారులు గాఢనిద్ర నుంచి మేల్కొని ఆర్అండ్‌బి, గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ప్రమాదాలకు నిలయాలుగా మారిన రోడ్లపై నిల్వ చేసిన కంకర, ఇసుక, ఐరన్ తదితర వస్తు సామగ్రిని వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనచోదకులు ముక్తకంఠంతో అధికారులను కోరుతున్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధి : ఎంపిపి

ప్రజాశక్తి - ముసునూరు

నాతోటి ఎంపిటిసిలు, అధికారుల సమన్వయ సహకారాలతో ముసునూరు మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళతానని మండల పరిషత్ అధ్యక్షురాలు కోండా దుర్గాభవాని వెంకట్రావ్ తెలిపారు. శనివారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్య రంగాల అధికారులు సమన్వయంతో పనిచేసినట్లయితే మండలాభివృద్ధి బాగుంటుందన్నారు. అదేవిధంగా జలకళ ద్వారా మండలంలోని 16 గ్రామాల్లో 131 బోర్లు వేయడం జరిగిందని, విద్యుత్ శాఖాధికారులు త్వరగా ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. అలాగే లోపూడి సర్పంచి పేరం కృష్ణ, రాజానాయన మాట్లాడుతూ 2020లో ఎన్ఆర్ఈజిఎస్ నిధులు లోపూడి గ్రామానికి రూ.2 లక్షల 69వేలు, సూరేపల్లి గ్రామానికి రూ.5 లక్షలు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి, ఆ నిధులు మంజూరు కాలేదన్నారు. అదేవిధంగా గత సంవత్సరంలో ఇంకుడుగుంతల పనికింద రూ.84,404 లోపూడి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తే ఇప్పటి వరకు ఆ నిధులు కూడా మంజూరు కాలేదని ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ స్పందించి ముసునూరు మండలం మెట్ట ప్రాంతం కావున రబీ సీజనల్ పంటలైన పుగాకు, మొక్కజొన్న, మిర్చి పంటలు రాత్రి వేళల్లో బోరు నీళ్లు పెట్టుకునే పరిస్థితి లేదు కాబట్టి గతంలో వలే పగలే వ్యవసాయ కరెంట్ త్రీ ఫేజ్ ఇవ్వాలని ఆ శాఖాధికారులను కోరారు. జలకళ బోర్లు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల నిర్మాణపనులు పెట్టుబడి పెట్టి చేపడితే, ఇప్పటి వరకు ఆ బిల్లులు మంజూరు కాలేదని, మండల అధికారులు స్పందించి మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పేరం కృష్ణ, చలసాని దామెదరరావు, పిల్లి సత్యనారాయణ, రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, గద్దల సుహాసిని మోహనరావు, కాట్రేనిపాడు ఎంపిటిసి సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిటిసి, అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు : పార్టీలకతీతంగా ముసునూరు మండలాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మండల వైసిపి అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. శనివారం ముసునూరు ఎంపిపి కార్యాలయం వద్ద వారు విలేఖర్లతో మాట్లాడుతూ మండలాభివృద్ధికి పార్టీలతో సంబంధం లేకుండా సేవ చేయడానికి, నిధులు మంజూరు చేయడానికి, పారిశుధ్యం, తాగు నీరు, వీధి లైట్లు మొదలైన పనులు చేయడానికి సహాయ సహకారాలతో సిద్ధంగా వున్నామన్నారు. అదేవిధంగా సింహాద్రిపురం, కోర్లగుంట ఆర్అండ్‌బి రోడ్డుకు రూ.35 లక్షలు, ఎల్లాపురం, బలివే ఆర్అండ్‌బి రోడ్లకు రూ.50 లక్షలు, అక్కిరెడ్డి గూడెం రోడ్డకు రూ.35 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి కోండా దుర్గాభవానీ వెంకట్రావ్, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, ఎంపిటిసి చిలీ లక్ష్మి, సర్పంచి కంచర్ల వాణి, రేగుల గోపాలకృష్ణ, ఎంపిటిసి వెంకమ్మ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో రహదారులు పూర్తి చేయాలి

టి.నరసాపురం: జగనన్న కాలనీల లేఅవుట్లలో రహదారులు పూర్తి చెయ్యాలని, ఇల్లు నిర్మించుకోవడానికి మౌలిక సదుపాయాలు త్వరితగతిన కల్పించాలని జెడ్‌పిటిసి సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. మండలానికి సంబంధించి పలు సమస్యలపై ఏలూరులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్, జెడ్‌పి ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు జెడ్‌పిటిసి అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలోని పిహెచ్‌సిలో వైద్య సేవలు అందుబాటులో ఉండడం లేదని, ఆసుపత్రి నుంచి వైద్య సేవలు వేరే గ్రామాలకు అందుతున్నాయన్నారు. దానికి సంబంధించి టెక్నికల్ ఇబ్బందులను తొలగించి పూర్తి వైద్య సేవలు బొర్రంపాలెం, చుట్టు పక్కల గ్రామాలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరగా దీనిపై స్పందించిన వారు డిఎంహెచ్ఒతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. బొర్రంపాలెం గ్రామంలో జిఎన్ఆర్ స్కూల్ రోడ్‌లో ఉన్నటువంటి లేఅవుట్‌లో గృహాలు కట్టుకోవడానికి అనుకూలంగా లేదని కింద అంతా బండరాయ ఉందని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారని కలెక్టర్, పిడి, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లకు వివరించారన్నారు. ఆ లేఅవుట్‌కు సంబంధించి స్థలం మార్పు గురించి ఎంఆర్ఒతో మాట్లాడి స్థలం మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పిడిని ఆదేశించారని తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి

రేషన్ వాహనాలపై మోడీ ఫొటో వేయాలి

టి.నరసాపురం: రేషన్ వాహనాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయాలని కోరుతూ బిజెపి యువ మోర్చా నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆహార ధాన్యాల కోసం రూ.6 వేల కోట్లు వెచ్చిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా మండల అధ్యక్షులు పాపోలు పూర్ణ శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.వీర్రాజు, కుసుని వీర్రాజు, మక్కిన శ్యామసుందరరావు పాల్గొన్నారు.

తెలుగు భాష పట్ల ఆసక్తి పెంచుకోవాలి

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు తెలుగు భాష పట్ల ఆశక్తి పెంచుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కె.కుటుంబరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం వ్యాస రచన, నీతి పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడాతు విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ ఛైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు కె.రాజు, సాయి సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ కె.పవన్ కుమార్, హిందీ ఉపాధ్యాయులు షేక్ యాకూబ్, వలి పాల్గొన్నారు.

ఏలూరు : విద్యార్థి దశలో ప్రతిఒక్కరూ ఏదో ఒక కళలో నైపుణ్యం సాధించాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని అవి మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని కళారత్న సుజయ్ కృష్ణ తెలిపారు. బాలల గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ పోటీలో దాదాపు 100 మంది విద్యార్థుల వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ జిల్లెల్లమూడి వరప్రసాద్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,గ్రంథాలయ నిర్వాహకురాలు ఎమ్.శోభ, రికార్డు అసిస్టెంట్ ఎం.కీర్తి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో 'మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన' అనే అంశంపై సీనియర్స్ విభాగంలో శ్రీసుగుణ డిగ్రీ కళాశాల, వైఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, జూనియర్స్ విభాగంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా కళాశాల, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

చింతలపూడి : గ్రంథాలయాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో దిశా చట్టం మీద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా దిశ చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. ప్రతిఒక్కరు ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీఫ్, ముస్లిం మైనారిటీ పెద్దలు అక్బర్ పాల్గొన్నారు.

చాట్రాయి: గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చంటిబాబు పాల్గొనగా లైబ్రేరియన్ బి.మణికంఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముదినేపల్లి : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వికాస్ కాలేజి ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలను యువత ఎలా సద్వినియోగ పర్చుకోవాలి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం.రామ్మోహన్ రావు, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపల్ కెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

జగన్ 56 నెలల పాలనలో రాష్ట్రానికి చేసిందేమిటి..?

భవిష్యత్ గ్యారెంటీలో మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన

ప్రజాశక్తి - చాట్రాయి

జగన్మోహన్‌రెడ్డి 56 నెలల పాలనలో రాష్ట్రానికి చేసింది ఏమిటని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మండలంలోని నరసింహారావు పాలెం గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయనతో పాటు నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న భూ సర్వే పేరుతో మీరు చేస్తున్న కార్యక్రమం చంద్రబాబునాయుడు కాలంలో భూదార్ పేరుతో ప్రారంభించినదని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో మర్రిబంధం, సీతారాంపురం గ్రామాల సర్వే చంద్రబాబు పాలనలోనే ప్రారంభించారన్నారు. నా బిసిలు, నా మైనారిటీలు అంటూ పదులసార్లు అంటున్నారు, మీరు ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఉపాధి కల్పన చేసి ఉంటే మరి ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేవని, గత నాలుగున్నర సంవత్సరాలలో ఎప్పుడూ అనని మాట ఇప్పుడు నా ఎస్‌సిలు, నా బిసిలు, నా ఎస్‌టిలు, నా మైనార్టీలు అంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు బ్యాంక్ రాజకీయాలకు తెర లేపారని ప్రజలందరికీ తెలుసు అన్నారు. గత ఎన్నికల సమయంలో వైసిపి ఇచ్చిన హామీలు కనీసం 10 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. మద్యం నిషేధం చేసి అక్కా, చెల్లెమ్మలకు కానుకగా ఇస్తానన్న జగన్‌రెడ్డి రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించారన్నారు. కాని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా మినీ మేనిఫెస్టోను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

పోలవరం:ఇటికలకోట గ్రామంలో జరిగిన బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామంలో ప్రజావేదిక నిర్వహించి టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణ, పోతుల శ్రీనివాసరావు, నునకాని రాంబాబు, కుంచె దొరబాబు, నల్లా రాంబాబు, కుంజం సుభాషిణి, తెల్లం సూర్యచంద్రం, యడ్ల వినోద్, పాదం ప్రసాద్, జారం కృష్ణ, జారం రాంబాబు, పైలా శ్రీనివాసరావు, పిల్లి నాగరాజు, తాడేపల్లి మనోజ్ కుమార్, తెల్లం లక్ష్మీ దుర్గా భవాని, జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర పాల్గొన్నారు.

కేసుల విచారణలో తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో కేసుల విచారణ త్వరితగతిన నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యలపై న్యాయమూర్తులతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయమూర్తులతో శనివారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కేసుల విచారణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమీక్షలు కేసుల విచారణ, నాన్ బెయిలబుల్ వారెంట్లు వేగవంతంగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను న్యాయమూర్తులకు సూచించామన్నారు. అలాగే డిసెంబర్ 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లను జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షదారులు సద్వినియోగం చేసుకోవలన్నారు. ఈ సదస్సులో మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ గోపాల్, జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

వ్యాపారులను ఇబ్బంది పెడితే సహించం

జంగారెడ్డిగూడెం: రేషన్ బియ్యం అక్రమ రవాణా పేరుతో వ్యాపారులను అకారణంగా ఇబ్బంది పెట్టవద్దని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు రెవెన్యూ, పోలీస్ అధికారులను కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బియ్యం రవాణా చేస్తున్న లారీని తనిఖీ చేసే నెపంతో శుక్రవారం సాయంత్రం నుంచి నిలిపివేసిన సంఘటనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం మిర్యాలగూడ నుంచి జంగారెడ్డిగూడెం వచ్చిన 100 క్వింటాల సాంబ రైస్ లోడు లారీని శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ నెపంతో రెండవ రోజు కూడా వదలకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అనుమానం ఉంటే వెంటనే తనిఖీ చేసి సక్రమంగా ఉన్న వాహనాలను విడుదల చేయాలని ఆయన కోరారు. ఉద్దేశపూర్వకంగా వ్యాపారులని ఇబ్బంది పెడితే సహించమని తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్‌పి, కలెక్టర్‌కు ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరపున ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

తాటిపర్తి ఎస్తేర్ రాణి, భర్త: చినబాబు నాయొక్క పాస్‌పోర్టు పోయినది. దేవ నుండి పెనుగొండ వస్తూండగా పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబర్: **V4399261** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
తాటిపర్తి ఎస్తేర్ రాణి
భర్త: చినబాబు
దేవ, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9133296636

ప్రకటన

నిట్టా సోమరాజు, S/o. కనకాంబరం అయిన నేను ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, తంగెళ్ళమూడి గ్రామంలో 300 చ॥గ॥ స్థలము R.S. No. 98/1 ను అన్నపనేని జమున గారి ద్వారా క్రయమును పొంది **ద.నెం. 1679/2020** తదాది నా స్వాధీనములో ఉన్న ఆస్తియై యున్నది. అయితే సదరు దస్తావేజు మరియు లింకు డాక్యుమెంట్స్ జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో లింకు డాక్యుమెంట్ నెం. 4035/2002 ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనను దొరికిన యెడల నాకు తెలియపర్చగలరు.

నా సెల్ నెం. **9705874796**

పాస్‌పోర్టు పోయినది

Guttula Srinivasa Rao అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 16-08-2009న **A197504** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు ది. 6-11-2023న పీతానివారిపాలెం గ్రామం నుండి పెనుగొండ మెయిన్‌రోడ్డుకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GUTTULA SRINIVASA RAO
S/o. Guttula Mohana Rao
D.No. 6-173, Peetani vari Palem,
Penugonda Mandal
West Godavari Dist., A.P.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.A. 34/2022 in E.P. 46/2022
in O.S. 104/2019

Between:
గంధం ఏడుకొండలు ...*DHR*
AND
కొండు సహదేవుడు వగైరా -*JDRs*

పై నెంబరు E.P. గ్రంథములో JDRs అయిన 1. కొండు సహదేవుడు, S/o. ముసలయ్య, హిందు, పురుషుడు, వయస్సు 38 సం॥లు, డో.నెం. 5-200, బోర్డు స్కూలు వద్ద, అడవికొలను (V), నిడమర్రు (M) ప॥గో॥జిల్లా. 2. కొండు భవాని, W/o. సహదేవుడు, హిందు, స్త్రీ, వయస్సు 32 సం॥లు, డో.నెం. 5-200, బోర్డు స్కూలు వద్ద, అడవికొలను (V), నిడమర్రు (M) ప॥గో॥జిల్లా లు శ్రీ కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసులు పంపమని ఆర్డరు యిచ్చియున్నారు. సదరు E.A. 341/2022 గ్రంథము ది. 23-11-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ది. 23-11-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయ్యి తమ ఆక్షేపణలను తెలియజేయవలసిందిగా యిందుమూలంగా తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం
17-11-2023
Sk.Md.భాషా
అడ్వకేట్, తాడేపల్లిగూడెం